

నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

తుపాన్ తీవ్రత దృష్ట్యా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు ఈ నెల ఆరో తేదీ బుధవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను తీరం దాటి బలహీనపడుతున్న సందర్భంలో అధిక వర్షాలు కురిసే పరిస్థితి ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించామని పేర్కొన్నారు. జిల్లాలోని ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు కచ్చితంగా ఈ ఉత్తర్వులను పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.



భీమవరం: తాడేరులో నేలనంటిన వరి పంట



పాలకొల్లు: నీట మునిగిన బస్టాండ్



వీరవాసరం: సుడిగాలికి విరిగిపడిన కొబ్బరిచెట్లు

ముంచిన మిచౌంగ్

రెండు రోజుల నుంచి వీడని వర్షం
జలదిగ్బంధంలో పంట పొలాలు, రోడ్లు
స్తంభించిన జనజీవనం
అధికారులు మరింత అప్రమత్తం
24 పునరావాస కేంద్రాలకు సుమారు 5 వేల మంది తరలింపు



భీమవరం: పట్టణంలో జలమయమైన రోడ్లు

ప్రజాశక్తి - భీమవరం

మిచౌంగ్ తుపాన్ జిల్లాను నిండా ముంచింది. జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జిల్లాలో జనజీవనం స్తంభించింది. పంట పొలాలు, రహదారులు, గృహాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రహదారులు చెరువులను తలపించాయి. ఇంటి నుంచి ఎవరూ బయటకు అడుగు పెట్టే పరిస్థితి కన్పించలేదు. కష్టం అంతా వర్షం పాలు కావడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

మిచౌంగ్ తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమైన చిరుజల్లులు, ఈదురు గాలులు సోమవారం ఉధృతమవ్వగా, సోమవారం అర్ధరాత్రి నుంచి ఇవి మరింత జోరందుకుని హోరుగాలితో కుండపోత వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, ఆకివీడు వంటి ప్రధాన పట్టణాల్లో పరిస్థితి మరింత దారుణంగా కన్పించింది. వ్యాపార సంస్థలు, దుకాణాలు, కుటీర పరిశ్రమలు ఏఒక్కటీ తెరుచుకోలేదు. ఎడతెరిపి లేని వర్షాలతో రెండు రోజులుగా పనుల్లేక పస్తులుంటున్నామని రోజువారీ కూలీలు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు, పేదలు వాపోయారు.

భీమవరం జలమయం

జిల్లా కేంద్రమైన భీమవరం భారీ వర్షాలకు జలమయమైంది. ప్రధాన రహదారులతోపాటు కాలనీలు, పల్లపు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. మెంటేవారితోట, ఆర్‌టిడిసి డిపో, లూథరన్ గ్రౌండ్, బ్యాంకు కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, దుర్గాపురం, ప్రకాశం చౌక్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, జువ్వలపాలెం రోడ్డు ప్రాంతాలు జలమయమై మోకాళ్ల లోతు నీటితో చెరువులను తలపించాయి. ఆయా మార్గాల్లో రాకపోకలకు వాహనదారులు నానావస్థలు పడ్డారు. భీమవరం-తాడేపల్లిగూడెం మార్గంలో గరగపర్రు వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భీమవరం పట్టణంలోని మూడు రైల్వే అండర్ పాస్‌ల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

అన్నదాత ఆక్రందన

తుపాన్ ప్రభావంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రైతాంగం కుదేలైంది. చేతికొచ్చిన పంట చేజారిపోతుంటే అన్నదాత ఆక్రందన వర్ణనాతీతం. జిల్లాలో 85,267 హెక్టార్లో సార్వా సాగు చేపట్టారు. కొన్ని రోజులుగా మాసూళ్లు ఊపందుకున్నాయి. వర్షాలు ప్రారంభమయ్యేటప్పటికి 54,200 హెక్టార్లలో పంట చేలల్లోనే ఉంది. తుపాన్ ప్రభావంతో సుమారు మూడు వేల హెక్టార్లలో పైరు నేలకొరిగినట్లు, వేలాది ఎకరాల్లో వరి పనలు నీట మునిగినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సుమారు 31 వేల టన్నుల ధాన్యం ఇంకా కళ్లాల్లోనే ఉంది. అయితే వాస్తవానికి ఈ లెక్క మరింత ఎక్కువగా ఉంటుందని రైతుల అభిప్రాయం. అయితే ఈ రెండు రోజుల్లో లక్షా 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, దీనిలో 90 శాతం ఆఫ్‌లైన్‌లో చేసినట్లు అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకొల్లు, నరసాపురం, వీరవాసరం, మొగల్తూరు, ఆచంట, యలమంచిలి మండలాల్లో వరిచేలు వర్షాలకు దెబ్బతిన్నాయి. ధాన్యపు రాశుల అడుగుభాగానికి వర్షపు నీరు చేరుతుండటంతో రైతులు నీటిని బయటికి పంపేందుకు చర్యలు చేపట్టారు. వరిచేలు ఈదురుగాలులు, వర్షాలకు నేలమట్టమవుతున్నాయి. ఆపై పడిపోయిన చేలు సైతం నీట మునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ఈ వర్షాలతో కనీసం సగం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

24 తుపాన్ ప్రభావిత ప్రాంతాలు.. 24 పునరావాస కేంద్రాలు

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలు చేపట్టడంలో అధికారులు నిమగ్నమయ్యారు. 24 తుపాన్ ప్రభావిత ప్రాంతాలను గుర్తించారు. మొగల్తూరు మండలంలో ఏడు, నరసాపురంలో ఐదు, భీమవరంలో మూడు, భీమవరం టౌన్‌లో మూడు, ఆకివీడు, కాళ్ల, తణుకు, పెనుమంట్ర మండలాల్లో ఒక్కోటి, తాడేపల్లిగూడెంలో రెండింటిని తుపాన్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. వాటి పరిధిలో 24 పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు ఐదు వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. వీరికి 608.5 కిలోల బియ్యం, 1202 కిలోల గోధుమపిండి, 2640 కిలోల పంచదారను అధికారులు అందించారు. 11 మంది హైరిస్కు ఉన్న గర్భిణులను ఆసుపత్రులకు తరలించారు.

తీరం.. అల్లకల్లోలం

సముద్ర తీర ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. పేరుపాలెం సౌత్, కెపి పాలెం సౌత్, తూర్పుతాళ్లు, పిఎంలంక, చినమైనవానిలంక గ్రామాల్లో సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సముద్ర పోటు ప్రభావంతో నీరు తీరం వైపు 35 మీటర్లు ముందుకు చొచ్చుకొచ్చింది.

పకడ్బందీగా తుపాను సహాయక చర్యలు

భీమవరం: తుపాను సహాయక చర్యలు పకడ్బందీగా చేపట్టామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. వర్షాలు రాక ముందు రైతులను అప్రమత్తం చేసి 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని దగ్గరలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులకు తరలించామన్నారు. కొంత ధాన్యాన్ని రైతులే నేరుగా బరకాలు కప్పి భద్రపరచుకున్నారని తెలిపారు. అధిక వర్షాల వల్ల గ్రామాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు ఉపాధి హామీ కూలీలను వినియోగిస్తున్నామన్నారు. వర్షాలు తగ్గగానే పూరిస్థాయిలో పునరుద్దరణ చర్యలు చేపడతామన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని కుటుంబాలకు ఒక్కో దానికి రూ.2,500 నగదు విపత్తు సహాయం కింద జమ చేస్తామన్నారు.

రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదు

జిల్లావ్యాప్తంగా 3373.6 మిల్లీమీటర్ల వర్షం
అత్యధికంగా ఆకివీడులో 275 మిల్లీమీటర్లు

భీమవరం: మిచౌంగ్ తుపాను నేపథ్యంలో జిల్లాలో రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురవడంతో గడిచిన 24 గంటల్లో భారీ వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా 3373.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా అత్యధికంగా ఆకివీడులో 275 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో 130.2 మిల్లీమీటర్లు, పెంటపాడులో 136.6, తణుకులో 112.2, అత్తిలిలో 144.6, గణపవరంలో 220, ఆకివీడులో 33, ఉండిలో 209.2, పాలకోడేరులో 191, పెనుమంట్రలో 104.8, ఇరగవరంలో 103.2, పెనుగొండలో 110.6, ఆచంటలో 150.8, పోడూరులో 111.4, వీరవాసరంలో 181.5, భీమవరంలో 217.2, కాళ్లలో 255.2, మొగల్తూరులో 277, నరసాపురంలో 126, పాలకొల్లులో 266.3, యలమంచిలిలో 124.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రొయ్య ఉక్కిరిబిక్కిరి

కాళ్ల: మిచౌంగ్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురవడం.. వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో రొయ్యలకు ఆక్సిజన్ సమస్య తలెత్తుతోంది. చెరువుల్లో మత్స్యసంపదను రక్షించుకోవడానికి రైతులు అదనపు పెట్టుబడులు పెడుతున్నారు. వాతావరణంలో అసాధారణ మార్పులు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులతో పిహెచ్ లోపిస్తోందంటున్నారు. వాటర్ పారామీటర్స్‌ను నిరంతరాయంగా చెక్ చేసుకోవడంతోపాటు ఏరియేటర్లు నిరంతరాయంగా తిరిగేలా చూసుకోవాలని కోరుతున్నారు. మండలంలో 18 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. 11 వేల ఎకరాల్లో వనామి రొయ్యల సాగు చేస్తున్నారు. ఏడు వేల ఎకరాల్లో చేపల సాగు ఉంది. ఉప్పుటేరు తీర గ్రామాల్లో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ సమస్య తలెత్తింది. దీంతో కౌంట్‌కు రాకుండానే చిన్న సైజు రొయ్యలను హడావిడిగా పట్టుబడి చేస్తున్నారు. చిన్న సైజు కారణంగా గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. వనామి రొయ్యల సాగుకు అనుకూలంగా ఉండడంతో చాలామంది రైతులు ఎకరానికి రూ.రెండు లక్షలు వరకు పెట్టుబడి పెట్టారు. అధిక వ్యయంతో ఏరియేటర్లు, విద్యుత్ మోటార్లు, పంపులు అమర్చారు. కనీసం ఖర్చులు కూడా రాకపోవడంతో అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్సిజన్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

ఇందిరా ప్రియదర్శిని, మత్స్యశాఖ అధికారి, కాళ్ల

ఆక్సిజన్ కొరత నివారణకు చెరువులో హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను తగు మోతాదులో పిచికారీ చేయాలి. వాతావరణం చల్లగా ఉండటంతో ఏరియేటర్లు నిరంతరం తిప్పాలి. బోట్లు, ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసి చెరువులోని నీటిని రీసైక్లింగ్ చేయడంతో కెరటాలు రావడంతో ఆక్సిజన్ ఉత్పన్నమవుతోంది. రైతులు రోజూ ఉపయోగించే మేతలో ఒక 20 శాతం తగ్గించి వేయాలి.



ఆక్వా చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు

సుడిగాలి విధ్వంసం



సుడిగాలికి బోల్తా పడిన వ్యాన్

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో సుడిగాలి భీభత్సం సృష్టించింది. విదేశాల్లో కన్పించే సుడిగాలి (టొర్నడో) మాదిరిగా ఆకాశం నుండి భూమి వరకు ఏకరీతిన ఈ సుడిగాలి వడ్డిగూడెం గొంతేరు ప్రాంతం, జాతీయ రహదారి, వీరవాసరం-పెనుమంట్ర రహదారి మీదుగా తోలేరు వరకు సాగి విధ్వంసం సృష్టించింది. సాయంత్రం మూడు గంటలకు ప్రారంభమైన ఈ సుడిగాలి కొద్ది నిమిషాల్లోనే ఈ ప్రాంతాలన్నింటినీ చుట్టుముట్టి విధ్వంసం సృష్టించింది. దీని ప్రభావంతో కొబ్బరి చెట్లు విరిగిపడ్డాయి. ట్రాక్టర్లు, మినీవ్యాన్‌లు తిరగబడ్డాయి. కరెంటు స్థంబాలు పడిపోగా రేకుల షెడ్లపై రేకులు ఎగిరిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఎగిరిపడ్డాయంటే దీని ప్రభావం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కెపి రైసుమిల్లుకు చెందిన ధాన్యం ఆరబెట్టే డ్రయ్యర్ దెబ్బతింది. పలు ప్రాంతాల్లో కరెంటు స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వీరవాసరం సబ్‌స్టేషన్ పరిధిలో అంధకారం నెలకొంది. సుడిగాలిలో చిక్కుకున్న ఒక వ్యక్తి పక్కనే ఉన్న కరెంటు స్తంభాన్ని పట్టుకుని నిలబడగా అది కాస్తా కూలిపోవడంతో స్వల్పగాయాలైనట్లు సమాచారం. ఇదే విధంగా తోలేరులో ఇద్దరు వ్యక్తులకు గాయాలై భీమవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. దీని ప్రభావం తగ్గిన వెంటనే అధికారులు రంగంలోకి దిగారు. రెవెన్యూ, మండల పరిషత్, ట్రాన్స్‌కో, అగ్నిమాపక సిబ్బంది వీరవాసరం-పెనుమంట్ర ఆర్అండ్‌బి రహదారిపై అడ్డంగా పడి ఉన్న చెట్లను తొలగించారు. ఆస్తి నష్టం వెంటనే చెప్పలేమని అధికారులు తెలిపారు. సుడిగాలి విధ్వంసం సృష్టించిన ప్రాంతాలను భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పరిశీలించారు.



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లు



రాశుల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి

తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోళ్లు

మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు రూరల్

తుపాన్ నేపథ్యంలో తేమతో సంబంధం లేకుండా ధాన్యాన్ని రైతుల నుంచి మిల్లర్లు తీసుకోవాలని ఆదేశించామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన తణుకు మండలం దువ్వ, అత్తిలి మండలం వరిగేడు గ్రామాల్లో కళ్లాల్లో ఉన్న ధాన్యపు రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి రైతులతో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా కళ్లాల్లోని ధాన్యం కొనుగోలు చేయాలని, అందుకు తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైస్‌మిల్లర్లను కోరినట్లు చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న ముందు జాగ్రత్తల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా తడిసిన ధాన్యం లేదన్నారు. రైతులు సాగు చేసిన స్వర్ణ రకం పంట మాసూళ్లు 98 శాతం పూర్తయ్యాయన్నారు. మిగిలిన రకాలు ధృడంగా ఉండటంతో గాలులకు అవి నేలకొరిగే అవకాశం లేదన్నారు. దీనివల్ల పంట నష్టం ఏమీ జరగదని చెప్పారు.

పునరావాస కేంద్రాల్లో చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం టౌన్: తుపాను నేపథ్యంలో ప్రజలు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ధైర్యం చెప్పారు. మంగళవారం ఆయన నరసాపురం మండలంలోని తీర ప్రాంతంలో పర్యటించారు. బియ్యపుతిప్ప, వేములదీవి తూర్పు, చినమైనవానిలంక, పెదమైనవానిలంక గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించారు. బాధితులను పరామర్శించి భోజన ఏర్పాట్లను పరిశీలించారు. తుపాను తీరం దాటిన రెండు రోజుల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదన్నారు. అనంతరం పట్టణంలోని మోకావారిపాలెం, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మొగల్తూరు: మండలంలో తీరప్రాంతాలైన కెపిపాలెం, పేరుపాలెం గ్రామాల్లో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులతో కలిసి పర్యటించారు. పేరుపాలెం సౌత్, మోళ్లపర్రు, ఏటిమొండి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ జి.అనితకుమారి, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, అధికారులు ఉన్నారు.



రాశుల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి

పారదర్శకతతో ఓటర్ల జాబితా

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి
రోల్ అబ్జర్వర్ ఎన్.యువరాజ్
దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తాం: కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావడంతోపాటు రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడమే లక్ష్యంగా ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టామని ఓటర్ల జాబితా సవరణ రోల్ అబ్జర్వర్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ సెక్రటరీ ఎన్.యువరాజ్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోల్ అబ్జర్వర్ యువరాజ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పుల సవరణకు సంబంధించి ఎలాంటి చిన్న పొరపాట్లకూ తావివ్వకుండా పక్కాగా రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఫారం 6, 7, 8 పెండింగులు, ఇతర ప్రక్రియ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తొలగింపులు, నమోదుపై ఓటరు ఆధార్ కార్డు లేదా కరెంట్ బిల్లును ప్రామాణికంగా తీసుకుంటామని వివరించారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓట్ల నమోదు కోసం డ్రైవ్ చేపట్టామన్నారు. ఫొటో సిమిలర్ ఎంట్రీస్, డిఎస్ఈలు, జంక్ క్యారెక్టర్స్, అనోమలిస్, పదిమంది ఓటర్లు ఉన్న జాబితాకు నోషనల్ నెంబర్లు ఇవ్వడం, జెండర్ రేషియా, ఎపిక్ జనరేషన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. వైసిపి, టిడిపి, కాంగ్రెస్ నేతలు కామన నాగేశ్వరరావు, మరపట్ల శ్యాంబాబు, వంశీరెడ్డి మాట్లాడుతూ కొంతమంది ఆంధ్రా, తెలంగాణ రెండు ప్రాంతాల్లో ఓట్లు కలిగి ఉన్నారని, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ బి.శ్రీమన్నారాయణరెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్‌మాధుర్, భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, ఇఆర్‌ఒలు జెడ్.వెంకటేశ్వరరావు, జివికె.మల్లికార్జునరావు, కెసిహెచ్.అప్పారావు, ఎస్‌టివి.రాజేశ్వరరావు, ఎ.దుర్గేష్, కలెక్టరేట్ ఎఒ వైకెవి.అప్పారావు, ఎన్నికల డిటి ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యువరాజ్

రైతులను, వర్ష బాధితులను ఆదుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - తణుకు రూరల్

మిచౌంగ్ తుపాన్ భీభత్సం వల్ల నష్టపోయిన అన్ని పంటల రైతాంగాన్ని, వర్ష బాధితులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒకు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఇప్పటికి 50 శాతం కోతలు పూర్తయ్యి మాసూళ్ల పనిలో రైతులున్నారన్నారు. మరో 50 శాతం చేలల్లోని పంట తడిచిపోయిందన్నారు. రైతులకు అధికారులు వెంటనే బరకాలు, సంచులు అందజేయాలన్నారు. తడిచిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

భీమవరం: తుపాను ప్రభావంతో వరి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, ఈ నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లుకు తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ధాన్యం రాశులను సంఘం నాయకులు పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు, ఆచంట, యలమంచిలి మండలాల్లో పరిశీలించారని తెలిపారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ వందలాది ఎకరాల్లో మాసూళ్లు చేసిన పంట కళ్లాల్లోనే ఉండి తడిచిముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యపు రాశుల్లోకి నీరు చేరి ధాన్యం తడిసిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం వాహనాలు ఏర్పాటు చేసి, తడిసిన ధాన్యం తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. పంట దెబ్బతిన్న కౌలురైతులకు తక్షణం ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనల్లో సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ కౌలురైతులు జి.శ్రీను, జె.వెంకట్రావు, బి.ప్రకాశం, వి.సత్యనారాయణ, కె.శ్రీనివాస్, కె.కనకరావు పాల్గొన్నారు.



పెనుమంట్ర: ధాన్యం రాశులను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ఆచంట (పెనుమంట్ర): తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతుల వద్ద ధాన్యాన్ని తేమ శాతం చూడకుండా రైతుభరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు అన్నారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యాన బ్రాహ్మణచెరువులో రైతుల వద్ద ఉన్న ధాన్యపు రాశులు పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడారు. రైతుల కష్టాలు అడిగి తెలుసుకున్నారు.

భీమవరం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని 12వ వార్డు వైఎస్ఆర్ కాలనీలో గృహాల్లోకి మోకాల్లోతు నీరు చేరడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్ఆర్ కాలనీని సిపిఎం బృందం మంగళవారం పరిశీలించింది. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వైకుంఠరావు మాట్లాడుతూ డ్రెయినేజీ నిర్మించినా వర్షపు నీరు వెళ్లే మార్గం లేక నీరు పొంగి ఇళ్లలోకి చేరుకుంటుందన్నారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో నేతలు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, భద్రమ్మ, ఎం.మంగ, కవల నాగలక్ష్మి, అరుణ, స్థానికులు కవల ఆంజనేయులు, రమణ, తాతారావు, పెద్దిరాజు ఉన్నారు.



తణుకులో వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

రైతులు అధైర్యపడొద్దు

జిల్లా ప్రత్యేకాధికారి కన్నబాబు, కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - ఆచంట

తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, రైతులు అధైర్యపడొద్దని జిల్లా ప్రత్యేక అధికారి కె.కన్నబాబు, కలెక్టరు పి.ప్రశాంతి భరోసానిచ్చారు. మంగళవారం సాయంత్రం వారు ఆచంట వేమవరంలో నేలనంటిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం కన్నబాబు రైతులతో మాట్లాడారు. నష్టపోయిన వారికి ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ అధికార బృందం క్షేత్రస్థాయిలోనే ఉందని, పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అందుకు అనుగుణంగా అన్ని సహాయక చర్యలు తీసుకుంటున్నామన్నారు. యధాస్థితి వచ్చేంతవరకు, వ్యవసాయ శాఖ అధికారులు చెప్పేవరకు వరికోతలను వాయిదా వేసుకోవాలని రైతులను కోరారు. గ్రామ సర్పంచి జక్కంశెట్టి చంటి మాట్లాడుతూ ఆచంట వేమవరం పంచాయతీ పరిధి వెంకటాయిపాలెం, ఇసుక గరువు, వద్దిపర్రు గ్రామానికి వెళ్లే పుంత రోడ్లు అభివృద్ధి చేయాలని, దీనివల్ల రైతులకు చాలా ఉపయోగం ఉంటుందని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తహశీల్దారు ఎస్‌వి.సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారి బి.నాగరాజు, ఆర్ఐ జయలలిత పాల్గొన్నారు.

పోడూరు: జగన్నాధపురం గ్రామంలో నేలనంటిన వరిచేలను, బరకాలతో కప్పిన ధాన్యపు రాశులను తుపాను జిల్లా ప్రత్యేక అధికారి, మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు ధాన్యం అమ్ముకునేందుకు పలు సడలింపులు జారీ చేసిందన్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుభరోసా కేంద్రాలను సంప్రదించి తమకు నచ్చిన రైసు మిల్లులకు తరలించుకోవచ్చునని స్పష్టం చేశారు. వరి, ఉద్యాన తదితర పంట నష్టాలు అంచనా వేసి ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, ప్రత్యేకాధికారి డి.సావిత్రి, తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, ఎంపిడిఒ డి.సుహాసిని, ఎఒ సత్యనారాయణ ఉన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు వేతన కష్టాలు వీడని నీడలా వెంటాడుతున్నాయని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పిఎన్‌వి.ప్రసాదరావు అన్నారు. స్థానికంగా మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినెలా వేతనాలు ఆలస్యమవుతూనే ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఒకటి, రెండు నెలలు మాత్రమే ఒకటో తేదీన వేతనాలు చెల్లించారన్నారు. దీనితో ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారన్నారు. ఆ తరువాత వరుసగా పదో తేదీ తర్వాత వేతనాలు ఇవ్వాల్సిన్నారు. జీతాలు సక్రమంగా ఒకటో తేదీన చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

లోతట్టు గ్రామ ప్రజలకు పునరావాసం కల్పించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

లోతట్టు గ్రామ ప్రజలకు ప్రభుత్వం పునరావాసం కల్పించాలని సిపిఐ రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ కోరారు. మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలోని లోతట్టు గ్రామాలు జలమయం అయ్యాయని, అనేక కాలనీలు పూర్తిగా నీట మునిగడంతో రాకపోకలు లేకుండా పోయాయన్నారు. కొత్త పూసలమర్రు, దొంగపిండిలోసరి, నాగిడిపాలెం, నాగేంద్రపురం, బర్రివానిపేట, తోకతిప్ప, గూట్లపాడు గ్రామాల్లో కాలనీలు జలమయం అయ్యాయని, అధికారులు స్పందించి సహాయ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. గ్రామాల్లో సిపిఐ కార్యకర్తలు నాగిడితులసిరావు, తిరుమాని కామేశ్వరరావు, నాగిడి నాగరాజు, కృష్ణనాగిడి పాండురంగారావు, వాటాల రాధాకృష్ణ, తిరుమాని చంటిరాజు సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

పాడి పశువులకు టీకాలు

పోడూరు : మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు రావడంతో పశువులకు దొమ్మ వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి ఎస్.మహేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని వద్దిపర్రు గ్రామంలో ఉన్న పశువులకు మంగళవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ పంట కాలువలు, మురుగు కాలువలు, పరివాహక గ్రామాల్లోని కలుషిత నీటి వల్ల దొమ్మ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు. పశువు చనిపోతే సంబంధిత రైతు భరోసా కేంద్రంలోని పశు సహాయకునికి విఆర్‌ఒ ద్వారా పశు వైద్యులకు సమాచారం అందిస్తే నష్టపరిహారం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయకురాలు సిహెచ్.సుప్రియ, గోపాలమిత్ర రాపాక సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యవైశుల కార్తీక వన సమారాధన

తాడేపల్లిగూడెం : ఆర్యవైశ్యులు 72వ కార్తీక వన సమారాధన కార్యక్రమం మంగళవారం ఏలూరు రోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు దంపతులను, మారం వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరూ సేవా కార్యక్రమాలు అలవర్చు కోవాలన్నారు. సంఘ అభివృద్ధికి సహాయపడుతూ సమిష్టిగా సమస్యల సాధనకు కృషి చేయాలని మారం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కొట్టు విశాల్, జనసేన నాయకులు బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. నున్న సుందరం, చిన్న, వాసవి, వనిత క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఆలపాటి అచ్యుతలక్ష్మి, పొనగంటి స్వర్ణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నున్న శ్రీనాగలక్ష్మి హౌసీలు, లక్కీ డ్రాలు తీసి విజేతలకు బహుమతులు అందించారు.

16న జిల్లా స్థాయి పాటల పోటీలు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

పొలమూరు ఎపిఫానియ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన జిల్లా స్థాయి క్రైస్తవ భక్తి పాటలు పోటీలు నిర్వహించనున్నట్లు పెరిష్ పస్టర్ రెవరెండ్ పత్తుల ఆశిష్ విక్టర్ తెలిపారు. 15 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు పాల్గొనవచ్చని తెలిపారు. మద్దా వీరాస్వామి, నరసమ్మ జ్ఞాపకార్థం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన వారికి రూ.3000, రూ.2000, రూ1000 పాటు యూత్ క్రిస్మస్ కార్యక్రమంలో శాలువా, మేమెంటోలతో సత్కరించనున్నట్లు చెప్పారు.ఆసక్తి గల యువత ఈ నెల 15వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు చర్చి ట్రేసరర్ తాడిపర్తి సుజాత 8985105608 , 9440860314 సంప్రదించాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

22 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల గ్రామ డంపింగ్ యార్డ్ వద్ద గంజాయి అక్రమ వ్యాపారం చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేశామని కాళ్ల ఎస్ఐ విఎస్.వీరభద్రరావు తెలిపారు. ఎస్‌పి యు.రవిప్రకాష్ ఆదేశాల మేరకు, భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్ ఉత్తర్వుల మేరకు కాళ్ల పోలీసులు గ్రామ డంపింగ్ యార్డ్ వద్ద తహశీల్దార్ కృష్ణారావు సమక్షంలో గంజాయి అక్రమ వ్యాపారం చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 22 కిలోల గంజాయి సీజ్ చేశారు. పాడేరు నుంచి గంజాయి రహస్యంగా తీసుకొచ్చి చిన్న ప్యాకెట్‌గా చేసి యువత కు విక్రయిస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఆకివీడు సిఐ కెవివిఎన్.సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు. నలుగురిని రిమాండ్ నిమిత్తం భీమవరం కోర్టుకు పంపామని తెలిపారు.

వృద్ధుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పోడూరు


అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన పోడూరులో చోటు చేసుకుంది. విఆర్‌ఒ ఎస్.కుమార్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆచంట గ్రామం గొల్లపల్లివారిచెరువుకు చెందిన సరెళ్ల ధర్మారావు(72) పోడూరు సినిమా హాలు సమీపంలో మృతి చెంది ఉన్నాడు. మృతుని కుమారుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.రామ్‌కుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విఆర్‌ఒ కుమార్ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎడతెరిపిలేని వర్షం.. తీరని నష్టం

మిచౌంగ్ తుపాన్ వరి రైతుకు నష్టం మిగిల్చింది. పలుచోట్ల వరి చేలు నీటమునిగాయి. ధాన్యపు రాశులు తడిచిపోయాయి. ఈదురుగాలులకు వరి చేలు నేలకొరిగాయి. రోడ్లు జలమమం అయ్యాయి. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రజాశక్తి - ఆకివీడు

మిచౌంగ్ తుపాన్ వరి రైతును నిండా ముంచింది. మండలంలో సుమారు నాలుగు వేల ఎకరాలు వరి ఊడ్పు సాగింది. మొత్తం నూరు శాతం పంట నీట మునిగింది. పంట చేలల్లో, బోదెల్లో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఆకివీడు లంక దిగువనున్న పొలాలు మొత్తం నీటమునిగాయి. మరికొన్ని చోట్ల నీళ్లలో వరి పనలు తేలుతున్నాయి. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే పనికి రాకుండా పోతాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల ప్రభావంతో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షం కారణంగా సోమవారం సాయంత్రం నుంచి నామమాత్రంగానే కరెంటు ఉంది. వైర్లు ఎక్కడికక్కడ వాలిపోవడంతో నిరంతరంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికంగా పలు పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ అందక వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కొన్నిచోట్ల ట్యాంకుల్లోకి నీళ్లు వెళ్లిపోయి ఈ సమస్య ఏర్పడింది.



ఆకివీడు : నీటమునిగిన వరి

నిలిచిపోయిన గూడ్స్ రైలు

ఆకివీడు నుంచి సిద్దాపురం వెళ్లే రోడ్డులో ఉన్న రైల్వే గేట్ వద్ద మంగళవారం సాయంత్రం గూడ్స్ రైలు కొంతసేపు నిలిచిపోయింది. సుమారు అర కిలోమీటర్‌పైబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. వర్షం ప్రభావంతో సిగ్నల్స్ పడకపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని రైల్వే సిబ్బంది చెబుతున్నారు.

నీట మునిగిన నివాస ప్రాంతాలు

పట్టణంలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక శాంతినగర్‌లో రెండు అడుగుల నీరు నిలిచిపోయింది. నివాస ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. పల్లం కాని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కాకర్ల రాజరాజేశ్వరి ఇంట్లోకి నీరు ప్రవేశించింది. జిల్లా పరిషత్ హైస్కూల్ ఆట స్థలం మొత్తం వర్షపు నీటితో నిండిపోయింది. జాతీయ రహదారి వెంబడి అడుగు పైన నీరు నిలబడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఉండి : నీటమునిగిన జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రాంగణం

ఆకివీడు మండలంలో 3813 ఎకరాలు, కాళ్లలో 3868, ఉండిలో 10,791 ఎకరాలు మొత్తం 18,472 ఎకరాలు వరి పంట సాగు అయిందని వ్యవసాయ శాఖ ఎడి శ్రీనివాస్ తెలిపారు. వాటిలో 2,783 ఎకరాలు వరి పడిపోయిందని, మరో 1430 ఎకరాల్లో వరి నీట మునిగిందని చెప్పారు.

ఆచంట : మిచౌంగ్ తుపాన్ రైతులను తీవ్రంగా దెబ్బ తీసింది. ఆచంట మండలంలో ఇప్పటివరకు 500 ఎకరాలు మాత్రమే కోతలు కొయ్యగా మరో 9,900 ఎకరాలు కోత కోయాల్సి ఉందని మండల విస్తరణాధికారి బి.నాగరాజు తెలిపారు. మండలంలో నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల నవంబర్ నాలుగో వారం నుంచి కోతలు ప్రారంభించారని, ఈ తరహాలో డిసెంబర్ నెలలో పూర్తిస్థాయిలో పంట చేతికొచ్చిన సమయంలో అధిక వర్షాలు, తుపాన్లు, ఈదురుగాలుల కారణంగా రైతులు పంట నష్టపోతున్నారన్నారు. ఆచంట మండలంలో అత్యధికంగా 116 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిస్తే పంట నష్టం ఎక్కువగా ఉంటుందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమలమయ్యాయి. తుపాన్ ప్రభావం వల్ల మండలంలోని పెదమల్లంలో మంగళవారం సాయంత్రం భారీ ఎత్తున సుడిగాలి సంభవించడంతో ఆర్‌అండ్‌బి రహదారి పక్కన ఉన్న పెద్ద రావిచెట్టు విద్యుత్ తీగలపై పడి నేలకొరిగింది. స్థానికులు, అధికారులు స్పందించి రహదారిపై పడి ఉన్న ా వి చె ట ్ట న ం తొలగించారు. సుమారు మూడు గంటల పాటు విద్యుత్ అధికారులు శ్రమించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

కాళ్ల : తుపాను ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షానికి ఎక్కడికక్కడ వరిచేలు, ధాన్యం రాశులు తడిసిపోయాయి. మండలంలో 3,878 ఎకరాల్లో సార్వా సాగవుతోంది. ఇప్పటివరకు మండలంలో పలు గ్రామాల్లో 600 ఎకరాల్లో వరి కోతలయ్యాయి. రెండు వేల ఎకరాల్లో చేతికొచ్చిన వరి పంట రెండు రోజులుగా వర్షానికి తడిసింది. వెయ్యి ఎకరాల్లో వరి కంకులు బరువెక్కి వరి మొదలు పట్టు కోల్పోవడంతో వరిచేలు వర్షాలకు, ఈదురు గాలులకు నేలకొరిగాయి. పడిపోయిన వరి చేల పైకి వర్షపు నీరు చేరడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులకు పంటను గట్టుకు చేర్చుకునే తరుణంలో భారీ వర్షాలు కురవడంతో తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉండి : ఉండి మండల వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురవడంతో పల్లపు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. డ్రెయినేజీలు నిండిపోయి నీరు రోడ్లపైకి రావడంతో దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం నీట మునిగింది. రహదారి మొత్తం నీటితో నిండిపోయి బుధవారం పాఠశాలకు విద్యార్థులు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది. వర్షం వస్తే క్రీడా ప్రాంగణం నీట మునుగుతుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జులై 19వ తేదీన సందర్శించిన జెడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ దృష్టికి పాఠశాల ఉపాధ్యాయులు తీసుకువెళ్లగా క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తామని ఆమె హామీ ఇచ్చి ఐదు నెలలు కావాస్తున్నా ఇప్పటివరకు దానిపై చర్యలు లేవని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యలమంచిలి : నేలకొరిగిన వరి దుబ్బులను చూపుతున్న రైతులు

పాలకొల్లు : పాలకొల్లులో రోడ్లు చెరువులను తలపించాయి. హౌసింగ్ బోర్డు కాలనీతో పాటు పలు కాలనీలు నీట మునిగాయి. బస్టాండ్ నీటిలో మునిగి ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. రోడ్లపై జనసంచారం లేకపోవడంతో పలు షాపులు మూసివేశారు. దీంతో ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.

తణుకు : తుపాన్ నేపథ్యంలో తణుకులో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. దీంతో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. డ్రెయినేజీలు పొంగి వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు చలిగాలులు వీస్తున్నాయి. ఇళ్ల లోంచి బయటకు రావాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు.

మొగల్తూరు : నియోజకవర్గంలోని గ్రామాలు సాగునీటి కాలువలకు శివారున, మురుగు కాలువలు, ఉప్పుటేరులకు ముఖద్వారంలో ఉన్నాయి. గత వేసవి అనంతరం కాలువలకు నీటిని విడుదల చేసిన చాలా రోజుల వరకూ శివారుప్రాంతాలకు నీరు చేరలేదు. దీంతో సార్వాసాగులో నారుమడులు, నాట్లు వేయడానికి జాప్యం జరిగింది. సాగులోనూ నీటిఎద్దడి వేధించింది. వీటన్నిటి ప్రభావంతో ఈ ఏడాది దిగుబడులు గణనీయంగా తగ్గేఅవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. వరిచేల మాసూళ్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షానికి ఎగువనుంచి వచ్చే ముంపునీరు, సముద్రపోటుతో ఉప్పుటేరులు పోటెత్తి చేలు నీటమునిగే ప్రమాదం ఉంది. దీంతో పంట చేతికందేవరకూ ఆందోళన తప్పదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

442 ఎకరాల్లో మాసుళ్లు

మొగల్తూరు మండలంలోని 789 ఎకరాలకు 112 ఎకరాల్లో మాసుళ్లు పూర్తి చేశారు. 189 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. నరసాపురం మండలంలోని 6059 ఎకరాలకు 330 ఎకరాలో మాసుళ్లు పూర్తి చేశారు. 529 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు.

రైతులు ఆందోళన చెందొద్దు
అనిల్‌కుమారి, నరసాపురం ఎడిఎ

వరి చేల్లో నిలిచిన నీటిని బయటకు వెళ్లేలా బోదెలు ఏర్పాటు, నేలవాలిన వరిదుబ్బులను సరిచేసేందుకు ఉపాధి హామీ చట్టం కూలీలను వినియోగించుకునేందుకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అనుమతిచ్చారు. వర్షం తగ్గుముఖం పట్టిన అనంతరం తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ధాన్యం కొనుగోలు ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. రైతులు అందుబాటులో ఉన్న వాహనంలో ధాన్యం రవాణా చేసే వెసులుబాటు కల్పించారు.

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులన్నీ జలమయమయ్యాయి. భారీ వర్షాలు కురవడంతో వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేదు. దీంతో రహదారులపైనే వర్షపు నీరు నిలిచిపోయి చెరువులను తలపించాయి. ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. మండలంలోని పలు గ్రామాల్లోని కాలనీలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. మొగల్తూరులోని కొండవారిపాలెంలో జగనన్న కాలనీ పేరుపాలెం సౌత్‌లోని లైన్ పలవపాలంలోని కాలనీ, లక్కవరపు వారికాలనీలు జలదిగ్బంధనం అయ్యాయి. దీంతో ఆయా కాలనీలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామాలయం సెంటర్ సమీప ప్రాంతంలో చెట్టుకొమ్మ విరిగి రహదారిపై పడింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోతే ప్రమాదం తప్పింది. వాహన రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు ఆ చెట్టుకొమ్మను తొలగించి ట్రాఫిక్‌ని పునరుద్ధరించారు.

కాళ్ల : మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు జలమయం అయ్యాయి. మండల కేంద్రమైన కాళ్లలో రాష్ట్ర రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. ప్రధాన రహదారులు, పలు కాలనీలు జలమయమయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళక రోడ్లపై నిలిచిపోయింది. దీంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.



మొగల్తూరు : నీటమునిగిన కాలనీ

తాడేపల్లిగూడెం : మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. కూలి పనులు చేసుకునేవాళ్లు ఇళ్లకే పరిమితమయ్యాయరు. హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్‌టిసి ప్రాంగణం, కడకట్ల, మహాలక్ష్మి నగర్, శేషుమహల్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం రోడ్డు, ట్యాక్సీ స్టాండు రోడ్లు నీట మునిగాయి. డ్రెయిన్లు పొంగి మురుగునీరు రోడ్లపైకి చేరింది.

యలమంచిలి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల,ు ఈదురు గాలులకు మండలంలోని గుంపర్రు, చింతదిబ్బ ఇలపకుర్రు, కట్టుపాలెం, మేడపాడు, పెనుమర్రు, నేరేడుమిల్లి గ్రామాల్లోని వరిచేలు నేలకొరిగాయి. దీంతో చేలల్లోని నీటిని రైతులు బయటకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.

రైతులను ఆదుకుంటాం.. ప్రజలు ఆందోళన చెందొద్దు

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్, జెసి, అధికారులు, ఎంఎల్‌ఎలు



మొగల్తూరు : పునరావాస కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కన్నబాబు

ప్రజాశక్తి - కాళ్ల

సిసలీ గ్రామంలో తుపాను వల్ల పడిపోయిన వరి పొలాలను జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జెసి రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి జె.వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. వరి పంట నష్టం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కెఎస్.శ్రీనివాస్, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, కాళ్ల మండల వ్యవసాయాధికారి సిహెచ్.జయవాసుకి, ఆర్ఐ, సిసలీ గ్రామం విఆర్‌ఒ, విఎఎ, రైతులు పాల్గొన్నారు.

మొగల్తూరు : తుపాన్ ప్రభావంతో ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా పటిష్ట చర్యలు చేపట్టామని జిల్లా ప్రత్యేకాధికారి, మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. తుపాను హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలో సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు మంగళవారం మొగల్తూరు మండలం పేరుపాలెం (నార్త్), ఏటిమొండి, లైన్ పల్లిపాలెం, పునరావాస కేంద్రాల్లో, తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ ప్రభావిత ప్రాంతాలు యధాస్థితికి వచ్చేంతవరకు పునరావాస కేంద్రంలోనే భాదితులు ఉండేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. మత్స్యకారులు పడవలు, వలలు పనిముట్లను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో వండిన ఆహార పదార్థాలను పరిశీలించి, అక్కడున్న బాధితులతో ఆయన మాట్లాడారు. మొగల్తూరు, నరసాపురం మండలాల్లో 25 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని, 11 పునరావాస కేంద్రాల్లో 1,220 కుటుంబాలు, 5,113 మందిని తరలించామన్నారు. 11 మంది గర్భిణులను ఆయా ప్రభుత్వ వైద్యశాలలకు తరలించామన్నారు. ప్రతి పునరావాసకేంద్రంలో మెడికల్ క్యాంపు ఉండేలా 14 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. బాధితులు పునరావాస కేంద్రాలకు తరలిరావాలన్నారు. రవాణా శాఖ, ఆర్‌అండ్‌బి, విద్యుత్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, పంచాయతీ రాజ్, తదితర శాఖలు, ఎంపిడిఒలు, ప్రత్యేకాధికారులు బృందంలో ఉంటారని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అన్ని మందులతో పాటు పాము కాటు మందులు కచ్చితంగా ఉంచాలని చెప్పారు. పొలాలు, రహదారులు, ఇళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా దిగువ ప్రాంతాలకు తరలించేలా ఇంజన్లను ఏర్పాటు చేసి నీటిని తోడించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఆయనతో పాటు ఆర్‌డిఒ ఎం.అచ్యుత్‌అంబరీష్, మండల ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి, జిల్లా మత్స్య శాఖాధికారి ఆర్‌విఎస్.ప్రసాద్, తహశీల్దార్ బి.అనితాకుమారి, ఎంపిడిఒ ఉండ్రు బాబ్జిరాజు ఉన్నారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డి.మహేశ్వరరావు ఆదేశించారు. మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొగల్తూరులోని ఆరోగ్య కేంద్రంలో యాంటీ స్నేక్ వాక్సిన్ నిల్వల గురించి వైద్యాధికారి డి.దినేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. తుపాన్ ప్రభావిత ప్రాంతంలో ప్రజలకు వైద్య ఆరోగ్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటామన్నారు. ఆయనతో పాటు ఉప వైద్యారోగ్య శాఖాధికారి వి.ప్రసాద్, వైద్యాధికారి కె.లక్ష్మీపార్వతి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ మంగళవారం పర్యటించారు. పేరుపాలెం, కెపిపాలెం, కాళీపట్నం పలు గ్రామాల్లోని పర్యటించి ప్రజలతో మాట్లాడారు. బాధితులకు అండగా జనసేన పార్టీ ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు మండల శాఖ అధ్యక్షుడు కొల్లాటి గోపీ, పలువురు జనసైనికులు ఉన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని లంకకోడేరు, బల్లిపాడు, దగ్గులూరు, శివదేవునిచిక్కాల, తిల్లపూడి, పొలమూరు గ్రామాల్లో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మంగళవారం పర్యటించారు. తడిసిన ధాన్యాన్ని, ముంపునకు గురైన వరి చేలను ఆయన పరిశీలించారు. జోరు వానలో తడిసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టంలో ఎంఎల్‌ఎ మమేకమవుతూ పార చేతబట్టి బాటలు తీశారు. పడిపోయిన వరి చేల నుంచి నీరు డ్రెయిన్స్‌కే వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం

ఆచంట : రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. మిచౌంగ్ తుపాన్ కారణంగా మండలంలోని కొడమంచిలిలో దెబ్బతిన్న పొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున తప్పకుండా సహాయం అందిస్తామని, రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అధైర్య పడొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు యల్లమెల్లి బేబీరాజేష్, రైతు సంఘ అధ్యక్షులు మన్నె సుబ్బారావు, వార్డు మెంబర్లు చిలుకూరి శ్రీనివాస్, చింతపర్తి హరికృష్ణ, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి బొరుసు రాంబాబు, విఎఒలు నవీన్, శ్రీదేవి పాల్గొన్నారు.

ఉండి : తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు వరి చేలు నీట మునిగాయని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. నీట మునిగిన వరి చేలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 10,790 ఎకరాలు సాగు చేస్తున్నారని, అందులో 3054 ఎకరాలు కోత కోసి ధాన్యం పట్టుబడి పట్టారని, మిగిలిన 7,736 ఎకరాల్లో 255 ఎకరాలు ముంపునకు గురయ్యాయని, 560 ఎకరాల వరిచేలు పడిపోయాయని తెలిపారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ ధాన్యం కొనుగోలు చేసేందుకు ఇప్పటికే మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, రైతులు ఆందోళనకు గురి కావద్దని తెలిపారు.



పాలకొల్లు : నీరు పోయేందుకు గాడి కొడుతున్న ఎంఎల్‌ఎ నిమ్మల

ధాన్యం రాశులు తడవకుండా సహాయక చర్యలు

ఆచంట (పెనుమంట్ర) : రైతులు భద్రపరుచుకున్న ధాన్యం రాశులు తడవకుండా తమ సిబ్బందితో సహాయ చర్యలు చేపడుతున్నట్లు ఎఒ ఎ.జ్యోషిల, ఎంపిడిఒ పి.పద్మజ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ సిబ్బంది, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో మండలంలోని ఆయా గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎఒ జ్యోషిల, ఎంపిడిఒ పద్మజ మాట్లాడుతూ రహదారి పక్కన ఉన్న, పొలాల మధ్యలో గట్లపై రైతులు భద్రపరచుకున్న ధాన్యం తడవకుండా వాటి చుట్టూ నీళ్లు నిల్వ లేకుండా సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు. ముఖ్యంగా మార్టేరు, నెగ్గిపూడి, వనంపల్లి, ఆలమూరు, భట్లమాగుటూరు, ఓడూరు, మల్లిపూడి, సోమరాజు ఇల్లింద్రపర్రు, పెనుమంట్ర, మాముడూరు, జుత్తిగతో పాటు పలు గ్రామాల్లో రైతులు భద్రపరచుకున్న ధాన్యం రాశులు తడవకుండా రాశుల మధ్య నీళ్లు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు.



ఆచంట (పెనుమంట్ర) : సహాయక చర్యల్లో ఎన్‌ఆర్‌ఇజిఎస్, అగ్రికల్చరల్ సిబ్బంది

ఉపాధి కూలీలను ఉపయోగించుకోవాలి

వీరవాసరం : రైతులకు సహాయంగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ కూలీలను ఉపయోగించుకోవాలని మండల వ్యవసాయధికారి బిన్నీబాబు తెలిపారు. మండలంలో 178 హెక్టార్ల వరకు పంటలో వర్షపు నీరు నిలిచిందన్నారు. రైతులు తమ పంట పొలాల్లోని నీటిని బయటకు పంపేందుకు ఉపాధి కూలీలను వినియోగించుకోవాలని కోరారు. 150 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం రాశులుగా ఉందన్నారు. రైతులు ముందుకు వస్తే ఆ ధాన్యాన్ని మిల్లుల వద్దకు తోలడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ విధివిధానాలు ప్రకటించాల్సి ఉందన్నారు. ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు పాటిస్తూ రైతులు తమ పంట నష్టాన్ని తగ్గించుకోవాలన్నారు. రాయకుదురులో ధాన్యం రాశుల చుట్టూ చేరిన నీటి తొలగింపు పనులను సర్పంచి గెడ్డం భారతి, వైసిపి గ్రామాధ్యక్షుడు పోలిశెట్టి చంటి, గెడ్డం భాస్కరరావు, గుడాల శ్రీను, విఆర్‌ఒ, వ్యవసాయధికారులు చేశారు. తోలేరులో పంచాయతీ కార్యాలయం వద్ద చెట్టు కూలిందని సర్పంచి వేంద్ర వెంకట లీలాకృష్ణ తెలిపారు.

తాడేపల్లిగూడెం : చినతాడేపల్లి, కడియద్ద, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టెన్నపాలెం గ్రామాల్లో ఎడిఎ పి.మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ పర్యటించి వరి నారుమళ్లను మినుము పంటపై రైతులకు పలు సూచనలు చేశారు. మినుము పంటలో నీరు బయటకు తరలించేందుకు, ధాన్యం రాశులపై బరకాలు కప్పిన చోట నీళ్లు ఉంటే వాటిని బయటకు తరలించేందుకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ సిబ్బందిని వినియోగించుకోవాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారన్నారు. రైతుల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

భీమవరం రూరల్ : మిచౌంగ్ తుపాన్ ప్రభావం వల్ల రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా భీమవరం, వీరవాసరం తహశీలార్లతో ఫోన్‌లో మాట్లాడి పలు ఆదేశాలు జారీ చేశారు. తుపాను ప్రభావం తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈదురు గాలుల వల్ల కరెంటు వైర్లు తెగిపడిన చోట వెంటనే విద్యుత్తు పునరుద్ధరణ కార్యక్రమాన్ని కూడా చేసే విధంగాఅధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ ఎడి సిహెచ్.శ్రీనివాస్, ఎఒ నిమ్మల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల పాల్గొన్నారు.